batukammanews.com
TEL/2019/78873

# బతుకమ్మ

తాజా వార్తల సద్దిమూట

22 ఆగస్టు 2026
శనివారం

## లంచం తీసుకోని ఎసిబికి చిక్కిన పంచాయతీ కార్యదర్శి



జన్నారం, బతుకమ్మ: ఇంటి నిర్మాణం అనుమతులు, ఇంటి నెంబర్ కేటాయించాలంటే లంచం ఇవ్వాలని డిమాండ్ చేసిన పంచాయతీ సెక్రెటరీ ఎసిబి అధికారులు పట్టుకున్నారు. మంచిర్యాల జిల్లా జిన్నారం మండలం లింగాయి పల్లి పంచాయతీ కార్యదర్శి వరలక్ష్మి రూ.13 వేలు లంచం తీసుకోగా ఎసిబి అధికారులు శుక్రవారం గా పట్టుకున్నారు. పంచాయతీ కార్యదర్శి వరలక్ష్మి నేరుగా డబ్బులు తీసుకోకుండా తనతో పాటు పని చేసే మరోపంచాయతి కార్యదర్శి లావణ్య పోన్ పే కు డబ్బులు బాధితుడి నుంచి స్వీకరించింది. ఈ మేరకు కేసు నమోదు చేసి పంచాయతీ కార్యదర్శి వరలక్ష్మిని అరెస్టు చేసి కరీంనగర్ ఎసిబి  కోర్టులో హాజరు పంచినట్లు తెలిపారు.




### విశ్వసనీయ వార్తలతోనే

# ప్రజాస్వామ్యం బలోపేతం

### సంచలనాత్మకత,వైరల్ కంటెంట్ కంటే విశ్వసనీయతకు ప్రాధాన్యం ఇవ్వాలి

### ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్ జాతీయ సదస్సు ప్రారంభంలో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా

హైదరాబాద్, బతుకమ్మ : డిజిటల్ యుగంలో వేగం కంటే వార్తల్లో వాస్తవికత,నిష్పక్షపాతం,విశ్వసనీయతే అత్యంత ముఖ్యమని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. ముందు నిజ నిర్ధారణ చేయాలని, ఆ తర్వాతే వార్తను ప్రసారం చేయాలని ఆయన జర్నలిస్టులకు  సూచించారు. హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయం త్రం బంజారాహిల్స్ తాజ్ కృష్ణ లో నిర్వహిస్తున్న ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్ తొలి జాతీయ సదస్సును గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ప్రారంభించారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రెస్ క్లబ్‌ల ప్రతినిధులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గవర్నర్ ప్రెస్ క్లబ్స్ ప్రతినిధులు జర్నలిస్టులను ఉద్దేశించి మాట్లాడారు. మీడియా ప్రజాస్వామ్యానికి నాలుగో స్థంభం మాత్రమే కాదని, సమాజానికి కళ్లు, చెవులు, ప్రజల గొంతుక అని గవర్నర్ పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా జర్నలిస్టులను ఒకే వేదికపైకి తీసుకురావడం అభినందనీయమన్నారు. జర్నలిస్టుల సంక్షేమం, సామాజిక భద్రత, వృత్తిపరమైన అభివృద్ధికి ఫెడరేషన్ దోహదపడాలని ఆకాంక్షించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా అనలిటిక్స్ వంటి సాంకేతిక పరిజ్ఞానాలు జర్నలిజానికి కొత్త అవకాశాలను కల్పిస్తున్నాయని,అదే సమయంలో డీప్‌ఫేక్స్, ఏఐ రూపొందించిన వీడియోలు, తప్పుడు సమాచారంతో కొత్త సవాళ్లు ఎదురవుతున్నాయని తెలిపారు. సోషల్ మీడియా ద్వారా సమాచారం వేగంగా వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో జర్నలిస్టుల బాధ్యత మరింత పెరిగిందన్నారు.




02

### సర్వే మ్యాప్‌తో

# భూ వివాదాలకు చెక్

- ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు
- సెప్టెంబర్ 15లోగా రెండో విడత ఇందిరమ్మ
- ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక చేయాలి
- జగిత్యాల జిల్లా పర్యటనలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

02





### విదేశాంగ శాఖ అనుమతి

### నిరాకరణతో సీఎం రేవంత్ రెడ్డి

# అమెరికా పర్యటన రద్దు

- రాజకీయ కారణాలతో అనుమతి నిరాకరించడం" పై ముఖ్యమంత్రి  తీవ్ర విస్మయం
- అమెరికా పర్యటనకు కార్యక్రమాలను అధికారుల బృందం కొనసాగించాలని అదేశం

02

హైదరబాద్, బతుకమ్మ:కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ అనుమతి నిరాకరించిన నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి  నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం అమెరికా పర్యటన రద్దయింది.



02

### తెలంగాణ స్థానిక విద్యార్థులకే

# ఎంబీబీఎస్ సీట్లివ్వాలి

### నాలుగేళ్ల స్థానికత నిబంధనతో ఇతర రాష్ట్రాల వాళ్లకే లబ్ధి

### జీవో 150ను రద్దు చేయాలి

### తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత

# విదేశాంగ శాఖ అనుమతి నిరాకరణతో సీఎం రేవంత్ రెడ్డి అమెరికా పర్యటన రద్దు

ముఖ్యమంత్రి నేతృత్వంలోని ప్రతినిధి బృందం యూకే, అమెరికా దేశాల పర్యటనకు వెళ్లాల్సి ఉండగా, రాజకీయ కోణంలో అనుమతినిరాకరించబడిందని కేంద్రం తెలియజేసిన నేపథ్యంలో రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనను రద్దు చేసుకున్నారు. విధివిధానాలు, ప్రోటోకాల్ ప్రకారం ముఖ్యమంత్రి యూకే, అమెరికా పర్యటనకు రాష్ట్రం కేంద్ర అనుమతి కోరింది. తొలుత యూకే పర్యటనకు మాత్రమే అనుమతి లభించింది. అధికారిక ప్రతినిధి బృందం యూకేకు చేరుకున్న తర్వాత అమెరికా పర్యటనకు అనుమతి ఇవ్వడం లేదని కేంద్రం రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేసింది. తెలంగాణ అభివృద్ధి, విద్యా రంగ పురోగతికి, అలాగే వికసిత్ భారత్ నిర్మాణానికి తోడ్పడే ఈ పర్యటనకు "రాజకీయ కారణాలతో అనుమతి నిరాకరించడం" పట్ల ముఖ్యమంత్రి తీవ్ర విస్మయం వ్యక్తం చేశారు. అయినప్పటికీ కేంద్ర నిర్ణయాన్ని గౌరవిస్తూ లండన్ నుంచి హైదరాబాద్‌కు తిరిగి రావాలని, బోస్టన్, అమెరికా పర్యటనకు వెళ్లకూడదని నిర్ణయించుకున్నారు. కేంద్ర నిర్ణయంపై ముఖ్యమంత్రి స్పందిస్తూ, "ఈ పర్యటన ఉద్దేశం ఒక్కటే. కేంద్రం తీసుకొచ్చిన నూతన విద్యా విధానంలో భాగంగా ప్రపంచంలోని ప్రఖ్యాత విద్యా సంస్థలను భారత్‌కు, తెలంగాణకు, హైదరాబాద్‌కు తీసుకురావడం. అత్యుత్తమ ఐవీ లీగ్ విశ్వవిద్యాలయాలను, ప్రపంచంలోని అగ్రశ్రేణి విద్యాసంస్థల నుంచి విద్య, నైపుణ్యాలు, శిక్షణ పొందాలన్న మన యువత ఆకాంక్షలకు ఇవి సమాధానంగా నిలిచేవి" అని పేర్కొన్నారు. "దేశ నిర్మాణం, యువత భవిష్యత్తు విషయానికి వస్తే అందరూ రాజకీయాలు, ఎన్నికలకు అతీతంగా ఆలోచించాలని నేను ఎప్పుడూ విశ్వసిస్తాను" అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. వివిధ విశ్వవిద్యాలయాలతో ఇప్పటికే సంప్రదింపులు జరిపిన నేపథ్యంలో అమెరికా పర్యటనకు సంబంధించిన కార్యక్రమాలను అధికారుల బృందం కొనసాగించాలని, ఆయా విశ్వవిద్యాలయాలతో అవసరమైన అన్ని అవగాహన ఒప్పందాలు (వీశీఖం), భాగస్వామ్య ఒప్పందాలను పూర్తి చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. "హైదరాబాద్ ను ప్రపంచ స్థాయి నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దుతాం. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి హెచ్‌సీయూ, జేఎన్‌టీయూ తదితర విశ్వవిద్యాలయాల ఏర్పాటు హైదరాబాద్‌ను అత్యుత్తమ మానవ వనరుల కేంద్రంగా మార్చింది. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్... ఒక పాఠశాల ప్రపంచానికి నాయకత్వం వహించగలమని నిరూపించింది. అక్కడి నుంచి ప్రపంచంలోని గొప్ప టెక్ నాయకుల్లో కొందరు రూపుదిద్దుకున్నారు. ఐఐటీ, ఐఎస్‌బీ, ఐఐఐటీ, నల్సార్ వంటి సంస్థల ఏర్పాటుతో హైదరాబాద్ అగ్రశ్రేణి కార్పొరేషన్లు, వాటి గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లను ఆకర్షించగలిగింది. ఇప్పుడు ప్రపంచంలోని ప్రఖ్యాత విద్య, నైపుణ్య సంస్థలకు హైదరాబాద్‌ను కేంద్రంగా మార్చి, 21వ శతాబ్దపు మన ప్రగతి ప్రయాణానికి శక్తినిస్తాం" అని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పేర్కొన్నారు. షెడ్యూల్ ప్రకారం యూకేలో ముఖ్యమంత్రి ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, లండన్ బిజినెస్ స్కూల్, యూనివర్సిటీ ఆఫ్ లండన్ తదితర సంస్థలను సందర్శించి, వాటి ప్రతినిధులతో సమావేశాలు కొనసాగించనున్నారు. యునైటెడ్ కింగ్‌డమ్‌లోని ప్రముఖ క్రీడా సంస్థలు, నైపుణ్యాభివృద్ధి రంగ నాయకులతో సమావేశమై, తెలంగాణతో భాగస్వామ్యాలను అధికారికంగా ఖరారు చేసేందుకు ఈ పర్యటనలో ప్రయత్నిస్తారు. "హైదరాబాద్‌ను ప్రపంచంలోని అగ్రశ్రేణి నగరాల్లో ఒకటిగా తీర్చిదిద్దాలన్నది నా సంకల్పం, ప్రయత్నం. ఒక సాధారణ భారతీయుడు హైదరాబాద్‌లోనే హార్వర్డ్, ఆక్స్‌ఫర్డ్ లేదా ఎంఐటీ, ఎల్‌బీఎస్, ఎల్ఎస్ఈ వంటి ప్రపంచ స్థాయి సంస్థల నుంచి విద్య, సర్టిఫికేషన్ పొందగలగాలి. ఎందుకంటే చాలామంది నాయకులు తమ పిల్లలను విదేశాలకు పంపాలని కోరుకున్నారు. కానీ నేను ప్రపంచంలోని అత్యుత్తమ విద్యా సంస్థలను భారత్‌కు తీసుకురావాలని అభిలషిస్తున్నాను" అని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు

# తెలంగాణ స్థానిక విద్యార్థులకే ఎంబీబీఎస్ సీట్లివ్వాలి

హైదరాబాద్ , బతుకమ్మ : తెలంగాణ స్థానిక విద్యార్థులకే ఎంబీబీఎస్ సీట్లు కేటాయించాలని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. శుక్రవారం బంజారాహిల్స్ లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో నీట్ ర్యాంకులు సాధించిన తెలంగాణ రాష్ట్రానికి చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు కవితతో భేటీ అయ్యారు. ప్రభుత్వం 2024లో తీసుకువచ్చిన 150 జీవో కారణంగా ఇతర రాష్ట్రాలకు చెందిన విద్యార్థులకు ఎక్కువ సీట్లు వస్తున్నాయని.. ఫలితంగా తెలంగాణ ప్రాంత బిడ్డలకు అన్యాయం జరుగుతోందని వివరించారు. కవిత స్పందిస్తూ, వారం రోజుల్లో ఎంబీబీఎస్ సీట్లు అలకేట్ చేసే అవకాశ ఉండటంతో ప్రభుత్వం తెలంగాణ స్థానిక విద్యార్థులకు అన్యాయం జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. వచ్చే విద్య సంవత్సరం నాటికి తెలంగాణ విద్యార్థులకు అన్యాయం చేసే జీవో నం.150ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తెచ్చిన అనాలోచిత జీవోతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళనలో ఉన్నారని తెలిపారు. రెండేళ్లుగా విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం విచారకరమన్నారు. 9వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు నాలుగేళ్లు తెలంగాణలో చదివితే స్థానికత వర్తించేలా జీవో నం.150 తేవడంతో ఇతర రాష్ట్రాల నుంచి ఇక్కడికి వచ్చి చదువుతోన్న విద్యార్థులకే ఎక్కువ ఎంబీబీఎస్ సీట్లు దక్కుతున్నాయని తెలిపారు. ఏటా సుమారు 1,500ల నుంచి 2 వేల సీట్లు ఇతర రాష్ట్రాల విద్యార్థులకే దక్కుతున్నాయని, ఆమేరకు తెలంగాణ విద్యార్థులకు నష్టం జరుగుతోందన్నారు. ఒకటి నుంచి పదో తరగతి వరకు ఏడేళ్లు ఏ రాష్ట్రంలో జరిగితే అక్కడ స్థానికత వర్తించేలా పాత జీవోను పునరుద్ధరించాలని సూచించారు. నీట్ కారణంగా ఇప్పటికే 15 శాతం సీట్లు కోల్పోతున్నామని, ఏ రాష్ట్రంలో మెడికల్ సీట్ల భర్తీకి ఆ రాష్ట్రమే ఎంట్రన్స్ నిర్వహిస్తే సీట్లు కోల్పోవాల్సిన ఆస్కారమే ఉండదన్నారు. విద్యార్థుల భవిష్యత్ ముడిపడి ఉన్న ఈ అంశం అత్యంత సెన్సిటివ్ అని.. ప్రభుత్వం వారం రోజుల్లో ఒక నిర్ణయం తీసుకోకుంటే తెలంగాణ విద్యార్థులకు మళ్లీ అన్యాయం జరుగుతుందనే విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలన్నారు. విదేశీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి వెంటనే ఈమేరకు చర్యలు చేపట్టేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

**రాహుల్ జీ.. తెలంగాణలో విద్యార్థులపై పోలీసుల**

**అఘాయిత్యాలపై మౌనమెందుకు?**

**'ఎక్స్' (ట్విట్టర్)లో ప్రశ్నించిన తెలంగాణ రక్షణ సేన చీఫ్**

**కల్వకుంట్ల కవిత**

ఢిల్లీలో విద్యార్థులపై పోలీసులు అమానుషంగా ప్రవర్తించిన ఘటనపై ఆఘమేఘాల మీద స్పందించిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో విద్యార్థులపై పోలీసులు అమానుషంగా ప్రవర్తిస్తే కనిపించటం లేదా అని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. ఢిల్లీలో ఒక న్యాయం, తెలంగాణలో ఒక న్యాయమా అని ఆమె రాహుల్ గాంధీని నిలదీస్తూ శుక్రవారం ఎక్స్ లో ట్వీట్ చేశారు. "రాహుల్ గాంధీ గారు ఢిల్లీలో విద్యార్థులపై పోలీసులు వ్యవహరించిన తీరుపై మీరు విద్యార్థులతో కలిసి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసిన తీరును స్వాగతిస్తున్నాం. పోలీసుల వ్యవహారశైలిని క్రూరత్వమంటూ మీరు చేసిన వ్యాఖ్యలను సమర్థిస్తున్నాం. కానీ అంతకన్నా క్రూరంగా తెలంగాణలో విద్యార్థులపై పోలీసులు వ్యవహరించిన అంశంలో మీ గొంతు ఎందుకు మూగబోయింది? మీ ప్రభుత్వం అధికారంలో ఉన్నరాష్ట్రంలో విద్యార్థులపై ఇంతటి అరాచకాలు జరుగుతుంటే మీరు ఎందుకు మౌనంగా ఉన్నారు? మీ నుంచి ఇలాంటి ద్వంద్వ వైఖరి బాధకలిగిస్తోంది." అంటూ కవిత ట్వీట్ లో పేర్కొన్నారు. ఢిల్లీలో పోలీసుల క్రూరత్వంపై విద్యార్థులతో కలిసి కంప్లైంట్ చేసిన రాహుల్ గాంధీ ఆ అంశాన్ని ఎక్స్ లో ట్వీట్ చేశారు. ఆ ట్వీట్ ను ట్యాగ్ చేస్తూ రాహుల్ గాంధీని కవిత నిలదీశారు. జీవో 97 కి వ్యతిరేకంగా మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్ వద్ద ఈ నెల 19 న పాలిటెక్నిక్ విద్యార్థులు శాంతియుతంగా నిరసన చేపట్టిన అంశాన్ని ప్రస్తావించారు. విద్యార్థులు తమ హక్కుల కోసం ధర్నా చేస్తే స్థానిక సీఐ అత్యంత అనాగరికంగా ఇద్దరు విద్యార్థుల గొంతు పట్టుకొని, వారిని ఊపిరాడకుండా చేస్తూ వెనక్కి నెట్టిన అంశంపై రాహుల్ గాంధీ ఎందుకు స్పందించటం లేదని కవిత ప్రశ్నించారు.

మీ ప్రభుత్వం అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో విద్యార్థులపై జరుగుతున్న అరాచకాలు కనిపించటం లేదా అని రాహుల్ గాంధీని కవిత క్వశ్చన్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ద్వంద్వ వైఖరిని తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారన్నారు. తెలంగాణలో విద్యార్థులను నేరస్తుల్లా చూస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిపై రాహుల్ గాంధీ స్పందించాలని కవిత డిమాండ్ చేశారు. లేదంటే సరైన సమయంలో తెలంగాణ విద్యార్థులు, ప్రజలు కాంగ్రెస్ పార్టీకి కర్రుకాల్చి వాత పెట్టటం ఖాయమని కవిత అన్నారు.

# సర్వే మ్యాప్‌తో భూ వివాదాలకు చెక్





జగిత్యాల, బతుకమ్మ : అర్హులైన ప్రతి పేద కుటుంబానికి కులం,మతం,రాజకీయాలకు అతీతంగా ఇందిరమ్మ ఇల్లు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ,గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల రెండో విడతలో అర్హులైన లబ్ధిదారులను సెప్టెంబర్ 15లోగా తుది జాబితా సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ శాఖ మంత్రి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సీసీఎల్ఏ కమిషనర్ లోకేష్‌కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజీవ్‌గాంధీ హనుమంతు,హౌసింగ్ ఎండీ గౌతమ్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తదితరులతో కలిసి మంత్రి జగిత్యాల జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా నూతనంగా మంజూరైన జగిత్యాల, మెట్‌పల్లి ఆర్డీవో కార్యాలయాలు, భీమారం, ఎండపల్లి తహసీల్దార్ కార్యాలయాలు, మాల్యాల, మెట్‌పల్లి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. మొత్తం ఆరు కార్యాలయాల నిర్మాణానికి రూ.11.80 కోట్ల అంచనా వ్యయంతో పనులు చేపట్టనున్నట్లు మంత్రి తెలిపారు. ఆధునిక వసతులతో కార్యాలయాలను నిర్మించి ప్రజలకు మరింత వేగవంతమైన,పారదర్శకమైన సేవలు అందించడమే ప్రభుత్వ ఉద్దేశమన్నారు.

. . . సెప్టెంబర్ 15లోగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక

జిల్లాలో మొదటి విడతలో 3,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని మంత్రి సూచించారు. ఎల్ 1, ఎల్ 2, ఎల్ 3 వంటి సాంకేతిక వర్గీకరణల కంటే అర్హతకు ప్రాధాన్యత ఇవ్వాలని, నిజమైన పేదలకు ఇళ్లు అందేలా శాసనసభ్యులు, ఇన్‌చార్జి మంత్రులతో సమన్వయం చేసుకుని లబ్ధిదారులను ఎంపిక చేయాలని అధికారులను ఆదేశించారు. వచ్చే నెల సెప్టెంబర్ 15 నాటికి రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను కూడా తుది చేయాలని స్పష్టం చేశారు. అర్హులైన ఒక్క కుటుంబం కూడా మిగిలిపోకుండా మరోసారి దరఖాస్తులు స్వీకరించి, క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి పారదర్శకంగా ఎంపిక చేయాలని సూచించారు. ప్రభుత్వ ఆలోచనలు, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ప్రజాప్రతినిధులు, అధికారులను కోరారు.

. . . భూ రీ సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

రాష్ట్రంలో చేపడుతున్న భూ రీ సర్వే అత్యంత కీలకమైన కార్యక్రమమని మంత్రి పొంగులేటి అన్నారు. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే రీ సర్వే ప్రధాన లక్ష్యమని, అధికారులు పకడ్బందీగా సర్వే నిర్వహించాలని ఆదేశించారు. సర్వే పూర్తయిన వెంటనే సంబంధిత భూ యజమానులకు మ్యాప్ అందిస్తే భవిష్యత్‌లో డిస్ప్యూట్‌లకు అవకాశం ఉండదని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్లు పూర్తి బాధ్యతతో చేపట్టాలని సూచించారు. ఇది రెవెన్యూ శాఖలో కొత్త శకానికి నాంది పలికే కార్యక్రమమని, కలెక్టర్లకు అనుభవంతో కూడిన ఉన్నత సవాలు అని అన్నారు. సర్వే నిర్వహించే సర్వేయర్లకు నిర్ణీత మొత్తాన్ని ప్రతి 15 రోజులకు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భూ సమస్యలు పెండింగ్‌లో లేకుండా వెంటనే పరిష్కరించాలని స్పష్టం చేశారు.

. . . రిజిస్ట్రేషన్ శాఖలో కొత్త విధానాలు

రిజిస్ట్రేషన్ శాఖలో పాత తరహా విధానాలకు స్వస్తి పలికి ప్రజలకు మరింత సులభతరంగా, పారదర్శకంగా సేవలు అందించే కొత్త విధానాలను తీసుకురాబోతున్నామని మంత్రి తెలిపారు. ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుతూ ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అసైన్డ్ భూముల అంశంపై శాసనసభలో విస్తృతంగా చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు. నూకలపల్లి 2బీహెచ్‌కే కాలనీకి రూ.32 కోట్లతో మౌలిక వసతులు నూకలపల్లి 2బీహెచ్‌కే కాలనీలో తొలి దశలో రూ.32 కోట్లతో తాగునీరు, డ్రైనేజీ, విద్యుత్ తదితర మౌలిక వసతులు కల్పించినట్లు మంత్రి తెలిపారు. రెండో దశలో పాఠశాల ఏర్పాటుకు నిధులు విడుదల చేస్తామన్నారు. కాలనీలో రేషన్ దుకాణం, బస్సు సౌకర్యం కల్పించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. జిల్లాలో ఇప్పటివరకు 10,365 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, 8,079 మంది లబ్ధిదారులకు రూ.227.32 కోట్లు విడుదలైనట్లు కలెక్టర్ వివరించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో మంత్రులు ముఖాముఖి నిర్వహించి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం 12 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు, చెరువులో ప్రమాదవశాత్తు మృతి చెందిన ఇద్దరు చిన్నారుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం అందజేశారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ ఎల్. రమణ, మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విశ్వసనీయ వార్తలతోనే

# ప్రజాస్వామ్యం బలోపేతం

### సంచలనాత్మకత,వైరల్ కంటెంట్ కంటే విశ్వసనీయతకు ప్రాధాన్యం ఇవ్వాలి

### ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్ జాతీయ సదస్సు ప్రారంభంలో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా

సోషల్ మీడియా ప్రభావంతో జెన్‌జీ ఆలోచనా విధానం మారుతోందని,యువతకు వాస్తవ, విశ్వసనీయ సమాచారాన్ని అందించడంలో జర్నలిస్టుల పాత్ర కీలకం అన్నారు. వేగం కంటే వాస్తవ నిర్ధారణ ముఖ్యం అని పేర్కొన్న గవర్నర్ సోషల్ మీడియా ట్రెండ్స్,?ఫేక్ న్యూస్‌కు లోనుకాకుండా ప్రజా ప్రయోజనమే లక్ష్యంగా వార్తలు అందించాలని జర్నలిస్టులను కోరారు. సంచలనాత్మకత, వైరల్ కంటెంట్ కంటే విశ్వసనీయత, నైతిక ప్రమాణాలకు మీడియా ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఫేక్ న్యూస్‌ను ఎదుర్కొనేందుకు డిజిటల్ లిటరసీ, ఏఐ లిటరసీ, ఫ్యాక్ట్ చెకింగ్ వంటి అంశాలపై ఫెడరేషన్ అవగాహన పెంచాలని సూచించారు. తప్పుడు సమాచారాన్ని అరికట్టడం ప్రభుత్వం ఒక్కదాని బాధ్యత మాత్రమే కాదని, మీడియా, సాంకేతిక సంస్థలు, పౌరులందరి సమష్టి బాధ్యత అని స్పష్టం చేశారు. నశా ముక్త్ భారత్ టీబీ ముక్త్ భారత్??వంటి జాతీయ కార్యక్రమాలను ప్రజా ఉద్యమాలుగా మలచడంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషించాలని గవర్నర్ పిలుపునిచ్చారు. తమ రచనలు, వార్తా సంస్థలు, డిజిటల్ వేదికల ద్వారా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని జర్నలిస్టులను కోరారు. ఫెడరేషన్ రాజకీయాలకు అతీతంగా సమ్మిళిత, ప్రజాస్వామ్య వేదికగా ఎదగాలని గవర్నర్ ఆకాంక్షించారు. జాతీయ సదస్సు భారతీయ జర్నలిజాన్ని మరింత బలోపేతం చేసి, విశ్వసనీయంగా, ప్రజా ప్రయోజనాలకు అనుగుణంగా తీర్చిదిద్దే దిశగా దోహదపడాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీ కె. శ్రీనివాస్ రెడ్డి, గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దానకిశోర్, హైదరాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఎస్. విజయ్‌కుమార్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రమేష్, ద హిందూ?గ్రూప్ పబ్లిషింగ్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ ఎన్. రామ్, ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్ అధ్యక్షుడు గౌతమ్ లాహిరీ తదితరులు పాల్గొన్నారు.

# ట్రాన్స్‌ఫార్మర్ల దొంగల వీరంగం

- నిద్రలేని రాత్రులు గడుపుతున్న రైతులు

వరుసగా ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ - చేతులెత్తేసిన విద్యుత్ శాఖ







బతుకమ్మ భిక్కనూరు:భిక్కనూర్ మండలంలోని బస్వాపూర్ గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి ట్రాన్స్ఫార్మర్ పగలగొట్టి అందులోని కాపర్ వైర్ ను దొంగలించిఎత్తుకెళ్లారు.
ట్రాన్స్‌ఫార్మర్ల దొంగల వీరంగం రోజురోజుకూ శృతి మించుతోంది. దొంగల ఆగడాలతో రైతులు నిద్రలేని రాత్రులు గడుపుతుండగా, వరుస చోరీలతో విద్యుత్ శాఖ అధికారులు చేతులెత్తేస్తున్నారు. ఈ దొంగతనాలు పోలీసులకే సవాల్‌గా మారాయి.
మండలంలోని వ్యవసాయ పొలాల వద్ద ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లను దొంగలు లక్ష్యంగా చేసుకున్నారు. రాత్రి 12 గంటల తర్వాత గుంపుగా వచ్చి, కరెంట్ స్తంభాలపై ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను కిందకు కూల్చుతున్నారు. అనంతరం అందులో ఉన్న విలువైన రాగి కాయిల్స్, కాపర్ వైర్లు, ఆయిల్ ను దొంగిలించి అక్కడి నుండే ఉడాయిస్తున్నారు.గత 2నెల ల్లోనే మండల పరిధిలోని రాగట్లపల్లి, గుర్జాకుంట, బస్వాపూర్, రామేశ్వర్ పల్లి, భిక్కనూర్ శివార్లలో సుమారు 30పై ట్రాన్స్‌ఫార్మర్లను దుండగులు ఎత్తుకెళ్లినట్లు రైతులు చెబుతున్నారు. ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్ విలువ దాదాపు రూ. 1లక్షల నుండి రూ. 2 లక్షల వరకు ఉంటుంది. దీంతో విద్యుత్ శాఖకు ఇప్పటివరకు దాదాపు రూ. 40 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు అంచనా.

**రైతులకు తీరని కష్టాలు:**
ట్రాన్స్‌ఫార్మర్లు చోరీ కావడంతో పంటలకు నీళ్లు పెట్టలేక రైతులు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. ప్రస్తుతం వరి నాట్లు వేసిన సమయంలో కరెంట్ లేకపోవడంతో పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొంది. కొత్త ట్రాన్స్‌ఫార్మర్ కోసం విద్యుత్ శాఖ చుట్టూ తిరగాల్సి వస్తోందని, దీనికి 15 నుండి 20 రోజులు పడుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
రాత్రంతా పొలం దగ్గరే కాపలా కాయాల్సి వస్తోంది. దొంగల భయంతో నిద్ర కూడా పోవడం లేదు అని బస్వాపూర్ కు చెందిన ఓ రైతు తెలిపారు.

**పోలీసుల గాలింపు.. దొరకని దొంగలు:**
ఈ ఘటనలపై బాధిత రైతులు భిక్కనూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు గస్తీ ముమ్మరం చేశామని, త్వరలోనే నిందితులను పట్టుకుంటామని ఎస్సై అనిల్ చెబుతున్నారు. అయితే, దొంగలు మాత్రం పోలీసులకు చిక్కకుండా తప్పించుకుతిరుగుతున్నారు.
విద్యుత్ శాఖ అధికారులు మాత్రం దొంగతనాలు పెరగడంతో ఏం చేయాలో తెలియక చేతులెత్తేస్తున్నారు. రాత్రి వేళల్లో పోలీస్ గస్తీ పెంచి, ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి దొంగలను కట్టడి చేయాలని రైతులు, ప్రజాప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు.



# పింఛను కోసం వాటర్ ట్యాంక్ ఎక్కిన వృద్ధుడు

- రెండు గంటలు హైడ్రామా

పోలీసుల జోక్యంతో కిందికి దిగిన వృద్ధుడు

బతుకమ్మ భిక్కనూరు:పింఛను రావడం లేదని మనస్తాపానికి గురైన ఓ వృద్ధుడు వాటర్ ట్యాంక్ ఎక్కి హల్‌చల్ చేశాడు. దాదాపు రెండు గంటల పాటు హైడ్రామా నడవడంతో ఆ ప్రాంతంలో ఉద్రిక్తత నెలకొంది. చివరకు పోలీసుల జోక్యంతో వృద్ధుడు కిందికి దిగడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. వివరాల్లోకి వెళితేభిక్కనూర్ మండలం కంచర్ల గ్రామానికి చెందిన గొల్ల రాములు అనే వృద్ధుడికి గత కొన్ని నెలలుగా పింఛను రావడం లేదు. ఈ విషయమై స్థానిక పంచాయతీ కార్యదర్శి, ఎంపీడీఓ కార్యాలయం చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయింది. దీంతో విసిగిపోయిన వృద్ధుడు ఈ రోజు ఉదయం గ్రామంలోని వాటర్ ట్యాంక్ ఎక్కాడు.నాకు పింఛను ఇప్పించండి లేకపోతే పై నుండే దూకి చస్తా అంటూ ట్యాంక్ పై నుండి కేకలు వేయడం ప్రారంభించాడు.

**రెండు గంటల హైడ్రామా:**
వృద్ధుడు ట్యాంక్ ఎక్కిన విషయం తెలుసుకున్న గ్రామస్తులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న భిక్కనూర్ పోలీసులుగ్రామస్తులు వృద్ధుడికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయినా వృద్ధుడు కిందికి దిగలేదు.దాదాపు రెండు గంటల పాటు ట్యాంక్ పైనే ఉండి హల్‌చల్ చేశాడు. కింద ఉన్నవారికి గుండె ఆగినంత పనైంది.

**పోలీసుల జోక్యంతో...:**
చివరకు పోలీసులు వృద్ధుడితో మాట్లాడి సురక్షితంగా కిందికి దించారు.



# నీట్ (పీజీ) పరీక్షకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

## కలెక్టర్ భవేష్ మిశ్రా

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నీట్(పీ.జీ) పరీక్షకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ భవేష్ మిశ్రా సూచించారు. ఈ నెల 30న జరుగనున్న నీట్ (పీజీ)-2026 పరీక్షను పురస్కరించుకుని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ భవేష్ మిశ్రా సంబంధిత అధికారులతో ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. జిలాలో నీట్(పీ.జీ) పరీక్షకు 265 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని తెలిపారు. అర్సపల్లిలోని ఏ.వీ ఎంటర్ ప్రైజెస్ లో 175 మంది, మల్లారంలోని షిఫ్ట్ టెక్నాలజీస్ సెంటర్ లో 90 మంది పరీక్షకు హాజరవుతారని కలెక్టర్ వివరించారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష కొనసాగుతుందని, అభ్యర్థులు నిర్ణీత సమయానికి ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. కాగా, ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలను దృష్టిలో పెట్టుకుని నీట్(పీ.జీ) పరీక్ష నిర్వహణలోనూ అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, నిబంధనలను తు.చ తప్పకుండా పాటించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ ధృవీకరణ పరికరాలు, విద్యుత్, తాగునీరు, వైద్య సదుపాయాలు తదితర ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని, అభ్యర్థుల గుర్తింపు ప్రక్రియను కట్టుదిట్టంగా అమలు చేయడంతో పాటు పరీక్షా కేంద్రాల వద్ద శాంతిభద్రతల పరిరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని




సూచించారు. సమీక్షా సమావేశంలో అదనపు డీ.సీ.పీ శుభం నగ్రాలే, ట్రైనీ కలెక్టర్ సురేష్, డీ.ఆర్.ఓ గీత, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, డీ.ఎం.హెచ్.ఓ డాక్టర్ రాజశ్రీ, కలెక్టరేట్ ఏ.ఓ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

# అడ్వకేట్స్ హెల్త్ ఇన్సూరెన్స్ కార్డ్స్ అందజేత




నిజామాబాద్ లీగల్, బతుకమ్మ :నిజామాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నీలకంఠ రావు, ప్రధాన కార్యదర్శి నల్ల సుభాష్ రెడ్డి న్యాయ వాదులకు "అడ్వకేట్స్ హెల్త్ ఇన్సూరెన్స్ కార్డ్స్ "ను అందజేశారు. జిల్లాకోర్టు సముదాయంలోని బార్ సమావేశపు హల్ లో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం "తెలంగాణ అడ్వకేట్స్ వెల్ఫేర్ ట్రస్ట్ " పేరున భీమా ప్రీమియమ్ చెల్లించడంతో న్యాయవాదులకు ఆరోగ్య భరోసా కలిగిందని తెలిపారు.ప్రతి న్యాయవాది ఆరోగ్యకార్డును సద్వినియోగం చేసుకో వాలని కోరారు. న్యాయవాదులతో పాటు కుటుంబ సభ్యులకు ఆరోగ్యకార్డు ఉపయోగకరమేనని అన్నారు.న్యాయవాదుల సంక్షేమ దిశగా అడుగులు మరిన్ని వేస్తామని వారు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యురాలు పరిపూర్ణ మాట్లాడుతు ప్రతి సంవత్సరంలాగే ఈ సంవత్సరం కూడా భీమా ప్రీమియమ్ ట్రస్ట్ తరపున చెల్లించడంతో హెల్త్ కార్డులు న్యాయవాదుల దరికి చేరాయని తెలిపారు.

## బీడీ కార్మికుల భారీ ర్యాలీ ధర్నాలను జయప్రదం చేయండి




నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : అర్హులైన బీడీ కార్మికులకు జీవన భృతికై శనివారం 22న జరిగే ర్యాలీ, ధర్నాలను జయప్రదం చేయాలని తెలంగాణ ప్రగతిల బీడీ వర్కర్స్ యూనియన్ (టీయూసీఐ)జిల్లా అధ్యక్షులు డి.రాజేశ్వర్ పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం చేయూత పెన్షన్లలో బీడీ కార్మికుల జీవన భృతి కూడా చేర్చాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 11 గంటలకు రాజీవ్ గాంధీ ఆడిటోరియం నుండి వేలాది మంది బీడీ కార్మికులతో ధర్నా చౌక్ వరకు ర్యాలీ నిర్వహించి, ధర్నా చౌక్ వద్ద మహా ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. ఈ ర్యాలీ ధర్నాలను జయప్రదం చేయాలని బీడీ కార్మికులకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేయూత పథకంలో జీవన భృతి అంశం చేర్చకపోవడం అన్యా యమన్నారు. వెంటనే అవకాశం కల్పిస్తూ ఉత్తర్వులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిచో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.వెంకన్న పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రంలో ఘనంగా అన్నప్రాసన



చందూర్, బతుకమ్మ:చందూర్ మండలంలోని కారేగాం తాండా గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో అన్నప్రాసన ,శ్రీమంతం కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరు నెలలు పూర్తైన చిన్నారులకు తొలిసారిగా ఘన ఆహారాన్ని అందించి అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించగా, గర్భిణీ మహిళలకు శ్రీమంతం కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ డాక్టర్ రమావత్ లాల్ సింగ్ మాట్లాడుతూ, చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు ఆరు నెలల తర్వాత వయస్సుకు అనుగుణమైన పౌష్టికాహారం అందించడం ఎంతో ముఖ్యమని తెలిపారు. అలాగే గర్భిణీ మహిళలు పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు అందుతున్న పౌష్టికాహారం ఆరోగ్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తల్లులు పిల్లల పోషణ, పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు.కార్యక్రమంలో వార్డు సభ్యుడు బలరామ్, విజయ, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గర్భిణీ మహిళలు, తల్లులు, చిన్నారులు, గ్రామ పెద్దలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# మహిళా సంఘాల ఆధ్వర్యంలో రాఖీ హోల్‌సేల్ దుకాణం ప్రారంభం



నందిపేట్, బతుకమ్మ:గ్రామీణ స్వయం సహాయక మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పూజ రాఖీ హోల్‌సేల్ దుకాణాన్ని నందిపేట్ మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు, నందిపేట్ సర్పంచ్ ఎర్రం లింగం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎర్రం లింగం మాట్లాడుతూ, మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగుతూ స్వయం సాధికారత సాధించడం నిజమైన స్త్రీశక్తికి నిదర్శనం అని అన్నారు. మహిళా సంఘాలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. మహిళా సంఘాల సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి వ్యాపారం విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు

## ఓడ్ల కృష్ణ కుటుంబాన్ని పరామర్శించిన బీఆర్ఎస్ నాయకులు.

ధైర్యంగా ఉండాలనికుటుంబంకు భరోసా.

బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని హామీ.



బాన్సువాడ బతుకమ్మ : నస్రుల్లాబాద్ మండలం మైలారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ ఓడ్ల మహేందర్ తమ్ముడు ఓడ్ల కృష్ణ నాలుగు రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న బాన్సువాడ బీఆర్ఎస్ నాయకులు మోరీలు శ్రీనివాస్, అంజిరెడ్డి శుక్రవారం మైలారం గ్రామంలోని ఓడ్ల మహేందర్ నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఓడ్ల కృష్ణ మృతికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, ఈ విషాద సమయంలో పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మృతుడి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ నాయకులు గోడిసెల నరసింహులు గౌడ్, టేకుర్ల సాయిలు, వెంకట్ సార్, గంపల శంకర్, రమేష్, రాము, రాజు, బాబు, కృష్ణ, శ్రీనివాస్, మోసిన్ , అక్బర్, సాయికుమార్, భాస్కర్, సాయిలు, గంగారాం, దశరథ్‌తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## బాన్సువాడ డివిజన్లో బంద్ ప్రకటించిన ట్రస్మా.



బాన్సువాడ బతుకమ్మ : నల్గొండ జిల్లాలోని ఓ ప్రైవేటు పాఠశాల ప్రిన్సిపాల్ రూపా రెడ్డి హత్యను ఖండిస్తూ శుక్రవారం బాన్సువాడ డివిజన్లోని పలు ప్రైవేట్ పాఠశాలలు బందును ప్రకటించాయి ఈ సందర్భంగా బాన్సువాడ ట్రస్మ అధ్యక్షులు పాశం రాజిరెడ్డి మాట్లాడుతూ పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించే ఉపాధ్యాయుల ను చదువు నేర్చుకుంటున్న విద్యార్థులే హత్య చేయడం తనను తీవ్రంగా బాధించిందని అన్నారు తల్లిదండ్రులు కూడా తమ పిల్లల పట్ల వారి అలవాట్ల పట్ల ఎప్పటికప్పుడు గమనించాలని అదేవిధంగా విద్యార్థులు పొరపాటు చేస్తే ఉపాధ్యాయుల దృష్టికి తీసుకొని వెళ్లాలని విద్యార్థుల మానసిక స్థితిని తల్లిదండ్రులు ఉపాధ్యాయులకు చెప్పకపోవడం వల్లనే ఇలాంటి సంఘటనలు ఏర్పడతాయని ఆయన అన్నారు ఇప్పటికైనా తల్లిదండ్రు పిల్లల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉపాధ్యాయులకు అధ్యాపకులకు ప్రభుత్వాలు పూర్తిస్థాయిలో రక్షణ కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు రూపారెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుని ప్రార్థిస్తున్నట్లు ఆయన తెలిపారు.

# కంపుకొడుతోంది.. శుభ్రం చేయించండి సారూ....

- అస్తవ్యస్థమైన మురికి కాలువలు....

- పట్టించుకోని అధికారులు...

- రోగాల భారిన పడుతున్న విద్యార్థులు, కాలనీ వాసులు...







రుద్రూర్, బతుకమ్మ న్యూస్ : సరైన పారిశుధ్య నిర్వహణ లేకపోవడం, పూడిక తీయకపోవడంతో మురికి కాలువలు అస్తవ్యస్తంగా మారి, ప్రజలు డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, అతిసార (డయేరియా) వంటి ప్రమాదకర రోగాల బారిన పడుతున్నారు. రుద్రూర్ మండలం సులేమాన్ నగర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల వద్ద గల ఓ కాలనీలో మురికి కాలువలు అస్తవ్యస్థంగా తయారయ్యాయి. అధికారులకు, పాలకులకు పలుమార్లు విన్నవించిన పట్టించుకోవడంలేదని కాలనీవాసులు వాపోతున్నారు. మురుగు కాలువ నుంచి నీరు బయటకి వెళ్లడానికి దారి లేక డ్రైనేజీలు నిండి మురుగునీరు ఇళ్ల ఆవరణలో చేరుతుండడంతో కంపుకొడుతోందని.. శుభ్రం చేయించండి సారూ అంటూ కాలనీ వాసులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజుల తరబడి మురికి నీరు ఇంటి ఆవరణలో ఉండడంతో దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు. వర్షాలు కురిసినప్పుడు పరిస్థితి మరింత దారుణంగా మారుతోందని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. అలాగే కాలువల్లో పూడిక, ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోవడంతో మురుగునీరు సాఫీగా ప్రవహించక రోడ్లపైకి వస్తోందన్నారు. మురికి కాలువల్లో దోమలు పెరిగి పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, కాలనీవాసులు అనారోగ్యాల బారినపడి ఆసుపత్రుల పాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు వెంటనే స్పందించి మురికి కాలువలను శుభ్రం చేయించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

# బాన్సువాడలో బీజేపీ, బీజేవైఎం ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

అంబేద్కర్ చౌరస్తా వద్ద విద్యార్థుల నిరసన.

ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలి.

రూ.15 వేల కోట్ల బకాయిలు వెంటనే చెల్లించాలి.

నిధులు విడుదల చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతాం.



బాన్సువాడ బతుకమ్మ : బాన్సువాడ పట్టణంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ, బీజేవైఎం ఆధ్వర్యంలో శుక్రవారం కళాశాల విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన వీధుల గుండా సాగిన ర్యాలీ అంబేద్కర్ చౌరస్తా వరకు కొనసాగింది. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్న రాజులు, మాజీ ఎమ్మెల్యే లక్ష్మీనారాయణ, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు నంది వేణు మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు రూ. 15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులు పెండింగ్‌లో ఉన్నాయని ఆరోపించారు. నిధుల విడుదలలో జాప్యం కారణంగా లక్షలాది మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు కళాశాల ఫీజులు చెల్లించలేక చదువులను మధ్యలోనే నిలిపివేసే పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న రూ. 15 వేల కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేసి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రతి విద్యార్థికి స్కాలర్‌షిప్ అందించి ఉన్నత విద్యను అభ్యసించేలా చర్యలు తీసుకుంటామని హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయడం లేదని విమర్శించారు. విద్యార్థుల సంక్షేమాన్ని పట్టించుకోని ప్రభుత్వం వెంటనే స్పందించాలని, లేనిపక్షంలో విద్యార్థులతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించలేని ప్రభుత్వం వెంటనే ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు విద్యార్థుల పక్షాన పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు కొనాల గంగారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కార్యదర్శి శంకర్ గౌడ్, మున్సిపల్ కౌన్సిలర్ గజ్జల మహేష్, పట్టణ ప్రధాన కార్యదర్శులు చిరంజీవి, ఉమేష్, బీజేపీ రూరల్ అధ్యక్షుడు శ్రీనివాస్, నస్రుల్లాబాద్ మండల అధ్యక్షుడు హనుమాన్లు, బీర్కూర్ మండల అధ్యక్షుడు సాయికిరణ్, కిషన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్ రెడ్డి, బీజేవైఎం మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్, జిల్లా కోఆప్షన్ సభ్యుడు తృప్తి ప్రసాద్, బీజేపీ నాయకులు చంద్రశేఖర్, లక్ష్మీనారాయణ, చీకట్ల రాజు, పాశం భాస్కర్ రెడ్డి, రాజాసింగ్, శివశంకర్, పురుషోత్తం, సచిన్, ప్రదీప్, మహేందర్, విశాల్, నాగరాజు, సాయి, సాయి రెడ్డి, యోగి, సాయికుమార్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## హెల్పింగ్ హాండ్స్ అసోసియేషన్ వేల్పూర్ ఆధ్వర్యంలో ప్రమాద బాధితునికి ఆర్థిక సహాయం



వేల్పూర్ బతుకమ్మ వేల్పూర్ సాయిబాబా టెంపుల్ వద్ద జరిగిన ప్రమాదంలో గాయపడిన మోతుకుల మల్లేష్ నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న హెల్పింగ్ హాండ్స్ అసోసియేషన్ సభ్యులు వారిది నిరుపేద కుటుంబం కావడం వల్ల అతనికి హెల్పింగ్ హాండ్స్ ద్వారా ఆర్థిక సహాయం చేయాలని నిర్ణయించుకొని శనివారం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఆరోగ్య వివరాలను తెలుసుకొని వారి తల్లికి రూ. 10, 500 ఆర్థిక సాయం అందించి సంస్థ తరఫున వారి యొక్క కుటుంబానికి ధైర్యం కల్పించడం జరిగింది. కష్ట సమయంలో అండగా నిలిచి, మానవత్వంతో స్పందించిన హెల్పింగ్ హాండ్స్ అసోసియేషన్ కు మల్లేష్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో హెల్పింగ్ హాండ్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు

## యువజన కాంగ్రెస్ బాల్కొండ నియోజకవర్గ కార్యవర్గ సమావేశం

యువజన కాంగ్రెస్ బలోపేతం, సంక్షేమ పథకాల అమలుపై నాయకులకు దిశానిర్దేశం



మోర్తాడ్, బతుకమ్మ యూత్ కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలి అని,రాహుల్ గాంధీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన చంత్రో కి గూంజ్ ద్వారా విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న తీరును వివరించాలని చేపూర్ చరణ్ గౌడ్ అన్నారు. యువజన కాంగ్రెస్‌ను గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడం, నాయకులు––కార్యకర్తల మధ్య సమన్వయాన్ని పెంపొందించడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా క్షేత్రస్థాయిలో పనిచేయడం వంటి అంశాలపై నాయకులు, మండల అధ్యక్షులకు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, యువతను పెద్ద సంఖ్యలో యువజన కాంగ్రెస్‌లో భాగస్వామ్యం చేయాలని సూచించారు. రాబోయే రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ జనరల్ సెక్రటరీ రిత్విక్, మోర్తాడ్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు అద్వాలా మనోజ్, భీంగల్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బద్ది అవినాష్ కమ్మర్పల్లి మండల అధ్యక్షులు నరేందర్, ఎర్గట్ల అధ్యక్షులు గంగా మోహన్,బాల్కొండ మండల అధ్యక్షులు అరవింద్, ముప్కాల్ అధ్యక్షులు ధనుష్,మోర్తాడ్ మండల్ ఉపాధ్యక్షులు నిరజ్,బాల్కొండ మండల్ సెక్రటరీ తేజ,గోనుగొప్పుల గ్రామ శాఖ అధ్యక్షులు అజయ్ గౌడ్, రనీత్, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా డిగ్రీ కళాశాల భవనాన్ని పరిశీలించిన పోచారం శ్రీనివాసరెడ్డి

చందూరు, బతుకమ్మ: చందూర్ మండల కేంద్రంలో మహాత్మా జ్యోతిబా పూలే మహిళా డిగ్రీ కళాశాల ఏర్పాటుకు ప్రతిపాదించిన భవనాన్ని ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాసరెడ్డి పరిశీలించారు. కళాశాల నిర్వహణకు భవనం అనుకూలంగా ఉందా, విద్యార్థినులకు అవసరమైన మౌలిక వసతులు అందుబాటులో ఉన్నాయా అనే అంశాలను ఆయన పరిశీలించారు.కళాశాల ఏర్పాటు ద్వారా మండలంలోని మహిళా విద్యార్థినులకు ఉన్నత విద్యను అభ్యసించే అవకాశం మరింత మెరుగుపడుతుందని పోచారం శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. కళాశాల అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సురేష్



బాబా, స్థానిక ప్రజాప్రతినిధులు గోపాల్, సర్పంచులు డా. లాల్‌సింగ్, సంజీవ్, ఉమారాణి, డా.రాజిరెడ్డి ,పీఎస్ఎస్ చైర్మన్ అశోక్, మండల



పార్టీ అధ్యక్షులు పొతరాజు శ్రీనివాస్, సీనియర్ నాయకులు రామిరెడ్డి, శ్రీనివాస్ గౌడ్, రాజిరెడ్డి, వసంత్‌రావు, బలరామ్ తదితరులు పాల్గొన్నారు.

# యువతను యువజన కాంగ్రెస్ లో భాగస్వాములను చేయాలి

నందిపేట్, బతుకమ్మ : గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయడం, నాయకులుకార్యకర్తల మధ్య సమన్వయాన్ని పెంపొందించడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హు లైన ప్రతి ఒక్కరికీ చేరేలా క్షేత్రస్థా యిలో పనిచేయడం వంటి అంశాలపై యువజన కాంగ్రెస్ నాయకులు, మండల అధ్యక్షులు సిద్ధం కావాలని యువజన కాంగ్రెస్ ఆర్మూర్ నియోజకవర్గ అధ్యక్షులు బైండ్ల ప్రశాంత్ పిలుపు నిచ్చారు. శు క్రవారం ఆర్మూర్ యువజన కాంగ్రెస్ నియోజకవర్గ కార్యవర్గ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ప్రశాంత్ మాట్లాడు తూ... యువజన కాంగ్రెస్‌ను. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్ర మాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, యువతను పెద్ద సంఖ్యలో యువజన కాంగ్రెస్ లో భాగస్వామ్యం చేయాలని సూచించారు. రాబోయే రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేసేం దుకు ప్రతి నాయకులు కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పాలిటె క్నిక్ కళాశాల విద్యార్థులతో మాటా డి శక్తి పాలసీ, 97 జీవో సమస్యపై చర్చించారు. ఈ సమస్యను పరిష్క రించేందుకు హైకమాండ్‌తో మాట్లా డి త్వరితగతిన పరిష్కారం కోసం కృషి చేస్తామని విద్యార్థులకు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో నందిపే ట్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు గుండు హరీష్, మాక్లూర్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు వినోద్, నందిపేట్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దూడ వెంకటేష్, మాజీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంద మహిపాల్, నందిపేట్ మండల యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు పిరాజీ నాగరాజు,శేఖర్,డొంకేశ్వర్ మండల యువజన కాంగ్రెస్ అధ్య క్షులు వంశీ రెడ్డి తదితరులతో పా టు యువజన కాంగ్రెస్ నాయకులు అక్బర్, అజార్, గౌతమ్, సందీప్, హరీష్, రాజు, రాకేష్, నరేష్, హైమద్, సంతోష్, అనిల్, ఆదర్శ్, సాయి యువజన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# విద్యార్థుల సామాజిక భాద్యత దేశ ప్రగతికి కీలకం

## ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్, ప్రొఫెసర్ అపర్ణ

డిచ్ పల్లి, బతుకమ్మ : తెలంగాణ యూనివర్సిటీలో ఎన్ఎస్ఎస్ యూనిట్-4 ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ వాలంటీర్ ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ ను యూనివర్సిటీ ఎన్ఎస్-ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ కె. అపర్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కె. అపర్ణ మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్‌లో భాగస్వామ్యం కావడం ద్వారా విద్యార్థుల్లో సామాజిక బాధ్యత, నాయకత్వ లక్షణాలు, వ్యక్తిత్వ వికాసం, సేవా భావం పెంపొందుతాయని పేర్కొన్నారు. సమాజ సేవలో విద్యార్థులు చురుకైన పాత్ర పోషించాలని నాట్ మీ బట్ అనే ఎన్ఎస్ఎస్ స్ఫూర్తితో సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లుగా చేరిన విద్యార్థులకు వివిధ సామాజిక అవగాహన కార్యక్రమాలు, ఆరోగ్య కార్యక్రమాలు, పర్యావరణ పరిరక్షణ, సేవా కార్యక్రమాలు, నాయకత్వ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం ఉంటుందని ఆమె తెలియజేసారు. ఈ కార్యక్రమాన్ని ఎన్ఎస్-ఎస్ యూనిట్ 4 ప్రోగ్రామ్ ఆఫీసర్ నర్సయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు సమీర్, అజయ్, అనిల్, లెనిన్ తదితరులు పాల్గొని ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ ను నిర్వహించారు. ఈ ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ ఆగస్టు 21 నుంచి 23 వరకు కొనసాగుతుందని కావున తెలంగాణ యూనివర్సిటీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఎన్ఎస్ఎస్‌లో చేరి సమాజ సేవలో భాగస్వాములు కావాలని ప్రోగ్రాం ఆఫీసర్



నర్సయ్య పేర్కొన్నారు. సేవ చేయండి ,స్ఫూర్తినివ్వండి , సమాజంపై సానుకూల ప్రభావం చూపండి అనే సందేశంతో ఈ ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

# ప్రణాళికతో చదివితేనే లక్ష్యాలను సాధిస్తారు

## వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య యాదగిరి

డిచ్ పల్లి, బతుకమ్మ : తెలంగాణ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల మొదటి సంవత్సర విద్యార్థులకు ఇండక్షన్ ప్రోగ్రాంకు ముఖ్యఅతిథిగా వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య యం.యాదగిరి హాజరైనారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రణాళిక బద్ధంగా కష్టపడి చదివితే విద్యార్థులు నిర్దేశించుకున్న లక్ష్యాలు తప్పకుండా చేరుకుంటారని తెలిపారు. విద్యార్థులు కష్టపడే తత్వాన్ని అలవాటుగా అలవర్చుకుంటే తద్వారా మంచి ఫలితాలు సాధించి వారికి, వారి కుటుంబానికి, దేశానికి దోహదపడగలరని ఆయన పేర్కొన్నారు. తె.యూ. ఇంజనీరింగ్



కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఆరతి మాట్లాడుతూ విద్యార్థులు తమ లక్ష్యాలను మారుతున్న టెక్నాలజీని దృష్టిలో ఉంచుకొని నిర్దేశించుకోవాలని, వాటి సాధనకు శ్రమించాలని



హితవుపలికారు. కార్యక్రమంలో బిటెక్ విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు, ఇంజనీరింగ్ విభాగం అధ్యాపకులు, వివిధ విభాగాల అధ్యాపకులు బోధ నేతర సిబ్బంది పాల్గొన్నారు.

# వైభవంగా వరలక్ష్మి వ్రతం పూజలు...



రుద్రూర్, బతుకమ్మ న్యూస్ : రుద్రూర్ మండల కేంద్రంతో పాటు రాణం పల్లి, బొప్పాపూర్, రాయకూర్, చిక్కడపల్లి తదితర గ్రామాల్లో శుక్రవారం ఘనంగా వరలక్ష్మి వ్రతం పూజలు నిర్వహించారు. వరలక్ష్మి వ్రతంలో భాగంగా అమ్మ వారికి భక్తి శ్రద్ధలతో ప్రత్యక పూజలు నిర్వహించి మహిళలకు వాయనం అందజేశారు. ఈ పూజలు నిర్వహించడం వల్ల అమ్మ వారి కృపాకటాక్షం అందరిపై ఉంటుందని పూజ నిర్వాహకురాలు విజయ లక్ష్మి మహిళలు తెలిపారు. గ్రామంలో అమ్మవారి ఆశీస్సులు అం దరిపై ఉండాలని ప్రార్తించారు. ఈ కార్యక్రమంలో విజయలక్ష్మి, లలిత, స్వప్న, మీనా, అనిత, పద్మ, జ్యోతి, అపర్ణ, సునీత,లావణ్య, నందిత, జనాభాయి, అంజవ్వ, మహిళలు ఉన్నారు.

# అంబంలో ఇంటింటికి మొక్కల పంపిణీ...



రుద్రూర్, బతుకమ్మ న్యూస్ : రుద్రూర్ మండలంలోని అంబం(ఆర్) గ్రామంలో శుక్రవారం గ్రామ సర్పంచ్ కుర్లం గంగాధర్ ఇంటింటికి మొక్కలను పంపిణీ చేశారు. ప్రతి ఇంట్లో మొక్కలు పెంచాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సాయిప్రసాద్, గ్రామ కమిటీ అధ్యక్షులు బడే రాములు, వార్డు మెంబర్ పట్టిప్ శ్రీనివాస్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం...

# ఇళ్లలో మహిళలు ప్రత్యేక పూజలు..

## సౌభాగ్యం, సిరిసంపదలు కలగాలని మహిళల ఆకాంక్ష...

బాన్సువాడ బతుకమ్మ : కామారెడ్డి జిల్లాలో శ్రావణ మాసం సంద ర్భంగా వరలక్ష్మీ వ్రతాన్ని మహిళలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహిం చారు.తెల్లవారుజామునే ఇళ్లను శు భ్రం చేసి, పూజా మందిరాలను పూలతో అలంకరించి వరలక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు చేపట్టారు. కలశ స్థాపన చేసి అమ్మవారిని లక్ష్మీ స్వరూ పంగా భావించి పూజలు, నోములు, వ్రత కథను భక్తిశ్రద్ధలతో చదివి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వ హించారు.వరలక్ష్మీ వ్రతం ఆచరిం చడం వల్ల కుటుంబంలో సుఖశాం తులు, సౌభాగ్యం, ఐశ్వర్యం, ఆరో



గ్యం కలుగుతాయని భక్తుల విశ్వా సం. మహిళలు కొత్త వస్త్రాలు ధరిం చి, అమ్మవారికి నైవేద్యాలు సమ ర్పించి, తోటి ముత్తైదువులకు వాయనం అందజేయడం ఈ వ్రతంలో ప్రత్యేకతగా నిలుస్తుంది. దీంతో గ్రామాలు, పట్టణాల్లోని ఇళ్లన్నీ పండుగ వాతావరణాన్ని సంతరించుకున్నాయి.

# హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడిపితే సీజ్..

## ఇందల్వాయి ఎస్సై సుమలత

ఇందల్వాయి మండలంలోని ప్రయాణికులు ఖచ్చితంగా హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనాలు నడపాలని లేనియెడల ద్విచక్ర వాహనాన్ని సిచ్ చేసి కోర్టులో డిపాజిట్ చేయడం జరుగుతుందని ఇందల్వాయి ఎస్సై భూక్య సుమలత వెల్లడించారు, ఈ మేరకు శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే చట్టరీత్య నేరంగా పరిగణించబడుతుందని ఆమె హెచ్చరించారు, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



తీసుకుంటామని స్పష్టం చేశారు, ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 22 నుండి ప్రభుత్వ ఆదేశాలను కఠినంగా అమలు చేయడం జరుగుతుందని ఆమె అన్నారు, ప్రాణ రక్షణ కోసం ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించాలని సూచించారు లేనియెడల భారీ జరిమానా తో పాటు జైలు శిక్ష విధించడం జరుగుతుందని ఎస్ఐ సుమలత తెలిపారు

# ఏర్గట్లలో పండుగ సాయన్న ముదిరాజ్‌కు ఘన నివాళి

### సీఎం రేవంత్ రెడ్డికి ముదిరాజ్ ల కృతజ్ఞతలు

బతుకమ్మ, ఏర్గట్ల : తెలంగాణ రాబిన్‌హుడ్‌గా బహుజన ముద్దుబిడ్డగా పేరుగాంచిన పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి,వర్ధంతి కార్యక్రమాలను ప్రభుత్వపరంగా అధికారికంగా నిర్వహించేందుకు జీవో విడుదల చేయడంతో పాటు హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై పండుగ సాయన్న ముదిరాజ్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించడంపై ఏర్గట్ల మండల ముదిరాజ్ కులస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం ఏర్గట్ల మండల కేంద్రంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి, టపాకాయలు కాల్చి,స్వీట్లు పంపిణీ చేస్తూ ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రేండ్ల రాజారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముదిరాజ్ కుల పెద్దలు,కుల సభ్యులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొని పండుగ సాయన్న ముదిరాజ్ కు ఘన నివాళులు అర్పించారు. పండుగ సాయన్న ముదిరాజ్ కు అనుకూలంగా నినాదాలు చేశారు.

. . . పేదల పక్షాన పోరాడిన వీరుడు

ముదిరాజ్ కులంలో జన్మించిన పండుగ సాయన్న ముదిరాజ్ నిజాం పాలనలో నిరంకుశ అధికారాలను ప్రశ్నిస్తూ పేదల పక్షాన నిలిచిన ప్రజా నాయకుడిగా గుర్తింపు పొందారని నాయకులు పేర్కొన్నారు. 1860 ప్రాంతంలో జన్మించిన పండుగ సాయన్న ముదిరాజ్ సుమారు 35--38 ఏళ్ల వయసులోనే హతమయ్యారని, తెలిపారు. దొరలు, దేశ్‌ముఖ్‌లు, అధికారుల దోపిడీకి వ్యతిరేకంగా పోరాడుతూ, పేదలకు అండగా నిలిచిన ఆయనను తెలంగాణ రాబిన్‌హుడ్‌గా ప్రజలు గుర్తించారని అన్నారు.

పండుగ సాయన్న కేవలం సంపన్నుల నుంచి ఆస్తులు తీసుకుని పేదలకు పంచిన వ్యక్తి మాత్రమే కాదని, ఆనాటి నిజాం పాలనను, అధికారులను ప్రశ్నించి ఎదురొడ్డి,బహుజన రాజ్య స్థాపనకు ప్రయత్నించిన పోరాట యోధుడని పేర్కొన్నారు.ఆధిపత్య వర్గాల కుట్రల నేపథ్యంలో నిజాం ప్రభుత్వ చేత పండుగ సాయన్న ముదిరాజ్ హతమయ్యారని తెలిపారు.

. . . సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి అండగా ఉంటాం

ఇన్నేళ్లలో ఏ ప్రభుత్వం కూడా పండుగ సాయన్నను తగిన విధంగా గుర్తించలేదని,ప్రస్తుతం సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆయన సేవలను గుర్తించి అధికారికంగా జయంతి, వర్థంతి నిర్వహించేందుకు చర్యలు చేపట్టడం ముదిరాజ్ కులానికి సమాజంలో ఆత్మవిశ్వాసాన్ని పెంచిందని ఏర్గట్ల గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రేండ్ల రాజారెడ్డి అన్నారు.పండుగ సాయన్న ముదిరాజ్ కు గుర్తింపు కల్పించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలకు ముదిరాజ్ కులస్తులు అండగా ఉంటారని తెలిపారు. పండుగ సాయన్న ముదిరాజ్ వీరగాథలను దర్శనం మొగులయ్య వంటి కళాకారులు 12 మెట్ల కిన్నెరపై నేటికీ గానం చేస్తున్నారని గుర్తుచేశారు.ఇట్టి కార్యక్రమంలో



ఏర్గట్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శివన్నోళ్ల శివకుమార్, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గుండాల ముత్తెన్న,ఏర్గట్ల మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు రేండ్ల రవి, కాంగ్రెస్ పార్టీ నాయకుడు రేండ్ల రమేష్,సున్నపు శ్రీనివాస్,గడ్డం జీవన్,బద్దం లింగారెడ్డి,మేకల సాయన్న, సున్నపు లింగన్న, కూరాకుల బోర్రన్న,రోక్కెడ చిన్న సాయన్న, ఇబ్రహీంపట్నం పెద్ద ముత్తెన్న,గుండాల ముత్తెన్న,ఈరపట్నం చిన్న గంగయ్య,దండ బోయిన సాయి,మునీర్,సజ్జనపు రవి,ముదిరాజ్ కులానికి చెందిన సభ్యులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎత్తయిన ధర్మ ధ్వజాన్ని ప్రతిష్టించడం చారిత్రాత్మకం

### ఖిల్లా రామాలయ ఆవరణలో భూమి పూజ చేసిన అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్



నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : చారిత్రాత్మకమైన ఖిల్లా రామాలయంలో ఎత్తయిన ధర్మ ధ్వజాన్ని ప్రతిష్టించడం చారిత్రాత్మకమని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. నగరంలోని హిందూ సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర కూట రాజులు నిర్మించి, చత్రపతి శివాజీ మహారాజ్ గురువు సమర్థ రామదాసు అభివృద్ధి చేసిన ఖిల్లా రామాలయంలో 101 అడుగుల ధర్మ ధ్వజాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమ న్నారు. ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరు సహకరించాలని పిలుపునిచ్చారు. ధర్మ కార్యానికి హిందువులంతా ఏకమవ్వాల న్నారు. నగరవాసులందరికి కనపడేలా ఎత్తైన ధ్వజాన్ని ప్రతిష్టించడం అభినందనీయ మన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గురుప్రసాద్, కార్యదర్శి మారయ్య గౌడ్, మాజీ చైర్మన్ ముక్కా దేవేందర్ గుప్తా, కోశాధికారి వాసు, గంట లింగం, హిందూ సంస్థల ప్రతినిధులు నరేష్, ప్రవీణ్, సూరి, సంతోష్, సాయిరాం, సాయి, సందీప్, బీజేపీ కార్పొరేటర్లు, వీహెచ్ పీ, భజరంగ్ దళ్, ఏబీవీపీ నాయకులు పాల్గొన్నారు.

## సస్పెన్షన్ ఉత్తర్వుల రద్దు ప్రాథమిక సభ్యత్వ పునరుద్ధరణ

నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : కిసాన్ న్యాయ్ సత్యాగ్రహ కార్యక్రమంలో జరిగిన క్రమశిక్షణా రాహిత్యం కారణంగా ఈ యేడాది ఏప్రిల్ 8న జారీ చేసిన సస్పెన్షన్ ఉత్తర్వులకు సంబంధించిన విషయాన్ని పునఃపరిశీలించి, సమగ్రంగా చర్చించిన మీదట?సస్పెన్షన్, ప్రాథమిక సభ్యత్వ రద్దు ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకత్వం నిర్ణయించిందని నిజామాబాద్ కార్పొరేషన్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ అన్నారు.వరదాబట్టు వేణు రాజ్, పుంద్ర సాయి కిరణ్, నరేన్ దీప్ (చింటూ)లను కాంగ్రెస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వం తక్షణమే పునరుద్ధరించబడుతోందన్నారు. ముగ్గురు నాయకులతో పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబంధాలు కలిగి ఉండకూడదనే నిబంధనలు పూర్తిగా రద్దు చేయబడ్డాయ న్నారు. సదరు నాయకులు ఇకపై పార్టీ క్రమశిక్షణను కాపాడుతూ ఎఐసిసి అధిష్టానం సూచనలకు అనుగుణంగా నడుచుకోవాలన్నారు.

## నేడు నిజామాబాద్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యటన

### ఏర్పాట్లపై అధికారులతో కలెక్టర్ సమీక్ష

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం నిజామాబాద్ లో పర్యటించనున్నారు. ఉదయం 7 గంటలకు నాగారంలోని నిర్మితి కేంద్రం వద్ద హౌసింగ్ టవర్స్ నిర్మాణం కోసం స్థల పరిశీలన జరపనున్నారు. అనంతరం 43వ డివిజన్ పాములబస్తిలో ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణాలను పరిశీలించి, లబ్ధిదారులతో భేటీ కానున్నారు. ఉదయం 10.00 గంటలకు రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో లబ్దిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళ కేటాయింపు పత్రాలను పంపిణీ చేయనున్నారు.

అక్కడి నుండి గూపన్ పల్లికి చేరుకొని తహసిల్దార్ కార్యాలయాలు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల భవనాల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు. అదేవిధంగా దుబ్బ ప్రాంతంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణాలకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. ఉదయం 11.45 గంటల ప్రాంతంలో సమీకృత జిల్లా కార్యాలయాల





సముదాయం (కలెక్టరేట్)కు చేరుకుని హౌసింగ్, రెవెన్యూ అంశాలపై నిజామాబాద్, కామారెడ్డి ఉమ్మడి జిల్లాల అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో కలిసి జిల్లా ఇంచార్జి మంత్రి సీతక్క, ప్రభుత్వ సలహాదారులు పి.సుదర్శన్ రెడ్డి, షబ్బీర్ అలీ, పోచారం శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో మంత్రి పర్యటనను పురస్కరించుకుని కలెక్టర్ భవేష్ మిశ్రా శుక్రవారం సంబంధిత శాఖల అధికారులతో సమావేశమై చేపట్టాల్సిన ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. ఏర్పాట్లు పక్కాగా ఉండాలని, ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా పరస్పర సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు.

అంతకుముందు మంత్రి పర్యటించనున్న ప్రాంతాలను సంబంధిత అధికారులతో కలిసి కలెక్టర్ క్షేత్రస్థాయిలో సందర్శించి, అధికారులకు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ భుజంగరావు, ట్రైనీ కలెక్టర్ సురేష్, డీ.ఆర్.ఓ గీత, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఆర్డీఓ రాజేంద్రకుమార్, ట్రైనీ ఆర్డీఓ సందీప్ తదితరులు ఉన్నారు.

## ఆటో కార్మికుల సమస్యల పరిష్కారంపై 24 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఆటోల బంద్

నిజామాబాద్ సిటీ, బతుకమ్మ: ఆర్టీసీ యాజమాన్యానికి ఈ-వి ఆటోలను ఇవ్వాలనే ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలని, ఆటో రవాణా రంగ కార్మికుల కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని యుటియుసీ జిల్లా కన్వీనర్ కటారి రాములు కోరారు. యునైటెడ్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (యుటియుసి ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నాందేవాడలోని ఆర్ఎస్పి పార్టీ జిల్లా కార్యాలయంలో ఆటో కార్మికుల సమస్యలు, వారి న్యాయమైన డిమాండ్ ల సాధనకు జిల్లా కన్వీనర్ కటారి రాములు మాట్లాడుతూ ఈనెల 24వ తేదీ నుండి ఆటో సేవలు నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు రాష్ట్ర ప్రభుత్వం ,సంబంధిత శాఖలు ఆటో కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో ఆటో చార్జీలను పెంచాలని డిమాండ్ చేశారు. ఓలా, ఉబర్, రాపిడ్ వంటి ప్రైవేట్ యాప్‌లకు ప్రత్యామ్నాయంగా




ప్రభుత్వం స్వయంగా ఒక ప్రజా ప్రయోజన యాప్‌ను తీసుకురావాలని సూచించారు. అక్రమంగా ఉబర్ రాపిడ్ ద్వారా నడుస్తున్న టూ వీలర్ టాక్సీలను వెంటనే నిషేధించి, ఆటో కార్మికుల జీవనోపాధిని కాపాడాలని కోరారు.ఎన్నికల హామీ ప్రకారం ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి ?12,000 ఆర్థిక సహాయం అందించాలని, ప్రజలకు నిరంతరం సేవలందిస్తున్న ఆటో డ్రైవర్లను ఈ-చలాన్ల నుంచి మినహాయించాలని అన్నారు. జీవో నెం. 263లో పేర్కొన్న మిగిలిన ప్రయోజనాలను వెంటనే అమలు చేయాలని, వాహన సారథి పోర్టల్‌లో ఆటో డ్రైవింగ్ లైసెన్స్ సదుపాయాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు.జీవో ఎంఎస్ నెం. 60 ప్రకారం రవాణా వాహనాలకు రేడియం స్టిక్కర్లు తప్పనిసరి చేసిన నిబంధన నుంచి ఆటోలకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. గిగ్ మరియు ప్లాట్‌ఫారమ్ ఆధారిత సోషల్ సెక్యూరిటీ బోర్డులో ఆటో, క్యాబ్ కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించాలని, ఆటో కార్మికులకు యాక్సిడెంట్ బీమాను కొనసాగించడంతో పాటు సాధారణ మరణాలకు కూడా వర్తింపజేయాలని అన్నారు. 50 సంవత్సరాలు పూర్తయిన ఆటో కార్మికులకు నెలవారీ పింఛన్ అందించాలని, ఆత్మహత్య చేసుకున్న ఆటో కార్మికుల కుటుంబాలను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నెల 24 న రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న ఆటో బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ బంద్‌కు అన్ని వర్గాల ఆటో కార్మికులు, ప్రయాణికులు, ప్రజాసంఘాలు, కార్మిక సంఘాలు, ప్రజాస్వామ్య శక్తులు, సామాజిక సంస్థలు పూర్తి మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పిట్లా నరేష్, విన్ను గౌడ్, అబ్దుల్ ముజీబ్, ఇమ్రాన్, బాల ముకుంది, శ్రీనివాస్ లతోపాటు తదితరులు పాల్గొన్నారు

# కొండా కుటుంబాన్ని పార్టీ నుంచి సస్పెండ్ చేయండి

## టీపీసీసీకి తీర్మానం చేసి పంపిన కొండా వ్యతిరేక వర్గం

హైదరాబాద్, బతుకమ్మ : ఉమ్మడి వరంగల్ జిల్లాలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి కొండా సురేఖకు ఇతర కాంగ్రెస్ నాయకులకు మధ్య చెలరేగుతున్న వివాదాలు ముదిరి పాకాన పడ్డాయి. అయితే ఇటీవల పరకాలలో కొండా సుష్మిత చేసిన వ్యాఖ్యలను అదునుగా తీసుకుని?కొండా సురేఖ కుటుంబం మొత్తాన్ని కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తున్న ఆమె వ్యతిరేక వర్గం నాయకులు డిమాండ్ చేస్తున్నారు. గురువారం మంత్రి కొండా సురేఖ తన కూతురు చేసిన వ్యాఖ్యలకు తనకు సంబంధం లేదని టీపీసీసీకి వివరణ ఇవ్వడాన్ని వరంగల్ జిల్లా నాయకులతో పాటు ఇతర నాయకుల్లు, ప్రజాప్రతినిధులు మండిపడుతున్నారు. ఇటీవల వరంగల్ పూర్వపు జిల్లాలో సీఎం పర్యటనకు కొండా సురేఖ దూరంగా ఉండడం, రెండవ రోజే కొండా సుష్మిత సీఎంను టార్గెట్ చేస్తూ చేసిన వ్యాఖ్యలపై పీసీసీ సీరియస్ గా ఉంది. అదే సమయంలో కొండా సురేఖ వ్యవహార శైలిపై ప్రభుత్వం కూడా సీరియస్ గా ఉన్నట్లు కనిపిస్తుంది. రెండు రోజుల క్రితం కొండా సురేఖ మాజీ ఓఎస్డీ పై రియాల్టర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదైన విషయం తెల్సిందే. గతంలో ఓఎస్డీని అరెస్టు చేసేందుకు వచ్చిన పోలీసులతో సుష్మిత వ్యవహరించిన తీరు ఆనాడు ప్రభుత్వ పెద్దల కారణంగా వివాదం సద్దుమనిగిన విషయం విధితమే. అయితే ఏకంగా సీఎం రేవంత్ రెడ్డిని కొండా సుస్మిత టార్గెట్ చేసిన మాటలను ముఖ్యమంత్రి సీరియస్ గా తీసుకున్నట్లు తెలిసింది.

విదేశీ పర్యటనకు ముందే ఈ విషయంలో కఠినంగా వ్యవహరించాలని పీసీసీకి సూచనలు జారీ చేసినట్లు తెలిసింది. అందులో భాగంగానే షోకాజ్ నోటీసులు జారీ చేశామని పీసీసీ అధ్యక్షులు స్వయంగా ప్రకటించడంతో వరంగల్ కాంగ్రెస్ లో రాజకీయం మరింత వేడెక్కింది. కొండా సురేఖ ఇచ్చిన వివరణకు పీసీసీ క్రమశిక్షణ సంఘం ఎలాంటి చర్యలు తీసుకుంటుందోనని చర్చ మొదలైంది. పార్టీకి సంబంధం లేకుండానే కొండా సుస్మిత తనకు టికెట్ రాకున్నా పరకాల నుంచి పోటీ చేస్తానని ప్రకటించడంతో ఆమెను పార్టీ నుంచి సస్పెండ్ చేయడం దాదాపు ఖరారు అయిందని సమాచారం.

మంత్రి కొండా సురేఖ వ్యవహార శైలి కారణంగా ఇప్పటికి పార్టీకి రెండు సంవత్సరాలుగా కొత్త కొత్త తలనొప్పులు ప్రారంభమైన నేపథ్యంలో ఆమెపై కూడా కఠినంగా వ్యవహరించాలని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కోరడం చర్చకు దారి తీసింది. కొండా సురేఖకు వ్యతిరేకంగా ఉన్న వరంగల్ జిల్లా ఎమ్మెల్యేలు,నాయకులంతా నిన్న ప్రత్యేకంగా సమావేశమై కొండా కుటుంబాన్ని సస్పెండ్ చేయాలని తీర్మానం చేసి టీపీసీసీకి పంపినట్లు సమాచారం. వరంగల్ జిల్లాలో కొండా సురేఖ, కొండ మురళి కుటుంబానికి కాంగ్రెస్ నాయకులకు మధ్య సఖ్యత లేదు. సీఎం రేవంత్ రెడ్డి యూకె పర్యటన ముగిసిన అనంతరం చర్యలు ఉంటాయని కాంగ్రెస్ పార్టీలో టాక్ నడుస్తోంది.

## నిజామాబాద్ ఉత్తర మండల ఎంఈఓ కు ఘనంగా సన్మానం



నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : నిజామాబాద్ నార్త్ మండల విద్యాశాఖ అధికారి ఆర్ వి ఎన్ గౌడ్ ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ పొందుతున్న సందర్భంగా గురువారం జి హెచ్ ఎస్ దుబ్బ లో జరిగిన నార్త్,సౌత్ మండలాల కాంప్లెక్స్ సమావేశంలో జిపిఎస్ కోటగల్లి శంకర్ భవన్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామ్ చందర్ గైక్వాడ్ ఆధ్వర్యం లో రెండు మండలాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు ఆర్ వి ఎన్ గౌడ్ ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్ఎం రామచంద్ర గైక్వాడ్ మాట్లాడుతూ ఎంఈఓ గా బాధ్యతలు తీసుకున్నప్పటినుంచి మండలంలో విద్యాభివృద్ధి కోసం ఎనలేని కృషి చేశారని ఉపాధ్యాయులను ప్రోత్సహిస్తూ పాఠశాలల్లో నమోదు పెంచడమే కాకుండా నమోదైన విద్యార్థులు నిలకడగా ఉండే విధంగా కృషి చేశారన్నారు. ఉపాధ్యాయ సమస్యలే కాకుండా పాఠశాలలో నెలకొన్న సమస్యల పట్ల కూడా ఎప్పటికప్పుడు స్పందించేవారనీ అన్నారు. ఈ సమావేశంలో ఆర్పీలు ప్రవీణ్, చందు తోపాటు ప్రధానోపాధ్యాయులు భాస్కర్, హృదయ జ్యోతి, స్వామి, జెసి రాజు తోపాటు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో షహజాద్ భట్టీ నెట్‌వర్క్ జాడలు

హైదరబాద్, బతుకమ్మ:హైదరాబాద్‌లో సోషల్ మీడియా ఇన్ఫ్లూయెన్సర్, గ్యాంగ్‌స్టర్ షహజాద్ భట్టీ నెట్‌వర్క్ కు సంబంధించిన జాడలు వెలుగులోకి రావడం కలకలం రేపుతోంది. పాక్ ఐఎస్ఐ నెట్‌వర్క్ తో హైదరాబాద్‌కు సంబంధాలు ఉన్నాయన్న కోణంలో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో యూసుఫ్‌గూడ, మేడ్చల్ ప్రాంతాల్లో కీలక ఆధారాలు లభించినట్లు సమాచారం. గతంలో అరెస్టైన ఇద్దరు యువకులకు ఈ నెట్‌వర్క్‌తో సంబంధాలు ఉన్నట్లు దర్యాప్తులో పోలీసులు గుర్తించినట్లు తెలుస్తోంది. ఉగ్రకుట్ర కేసులో భాగంగా ఇటీవల దేశవ్యాప్తంగా 253 మంది అరెస్ట్ అయిన విషయం తెలిసిందే. 14 రాష్ట్రాల్లో 253 మందిని అరెస్ట్ చేసినట్లు కేంద్రం వెల్లడించింది. 253 మందిలో తెలంగాణ నుంచి ఇద్దరు అరెస్టైనట్లు గుర్తించారు. వీరికి గాజియాబాద్‌కు చెందిన 22 ఏళ్ల జాయిద్ ఖాన్‌కు కీలక లింకులు ఉన్నట్లు బయటపడింది. జాయిద్ ఖాన్.. ఫిబ్రవరిలో మేడ్చల్‌లోని ఓ రెస్టారెంట్లో పనిచేసినట్లు దర్యాప్తులో గుర్తించారు. ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ ద్వారా ఐఎస్ఐ నెట్‌వర్క్ తో పరిచయం ఏర్పడిందని, అనంతరం ఐఎస్ఐ సానుభూతిపరులతో జాయిద్ ఖాన్ చాటింగ్ చేసినట్లు విచారణలో తేలింది. ఐఏఎస్ సానుభూతిపరులు హమీద్, రాణా హుస్సేన్‌లతో జాయిద్‌కు సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు గుర్తించిన తెలంగాణ కౌంటర్ ఇంటెలిజెన్స్.. వీరి చాటింగ్‌పై నిఘా పెట్టింది.



## విద్యార్థులపై దురుసు వైఖరి.. సీఐపై సస్పెన్షన్ వేటు



మహబూబాబాద్, బతుకమ్మ:మహబూబాబాద్‌లో జీవో నెం.97కు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న పాలిటెక్నిక్ విద్యార్థులతో సీఐ రఘుపతి రెడ్డి వ్యవహరించిన తీరు చర్చనీయాంశంగా మారింది.విద్యార్థులను అడ్డుకునే క్రమంలో సీఐ గొంతు పట్టుకున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. విద్యార్థుల పట్ల పోలీసుల వైఖరిపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తిన నేపథ్యంలో సీఐ రఘుపతి రెడ్డిని సస్పెండ్ చేసినట్లు సమాచారం. ఈ మేరకు డిఎస్పీ అధ్వర్యంలో విచారణకు అదేశించారు. రఘుపతిరెడ్డిని భాధ్యతల నుంచి తప్పించి ఇంచార్జ్ భాధ్యలను రూరల్ సిఐ అంజలికి ఇచ్చినట్లు సమాచారం.



## బాన్సువాడలో 5 ఎంవీఏ నుంచి 8 ఎంవీఏకు సామర్థ్యం పెంపు.

### విద్యుత్ సరఫరా మరింత మెరుగుపడే అవకాశం.

బాన్సువాడ బతుకమ్మ: బాన్సువాడ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో 5 ఎంవీఏ సామర్థ్యం ఉన్న పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను 8 ఎంవీఏకు పెంచిన అనంతరం శుక్రవారం సాయంత్రం విజయవంతంగా చార్జింగ్ చేశారు. దీంతో బాన్సువాడ ప్రాంత విద్యుత్ సరఫరా సామర్థ్యం మరింత పెరగనుంది. అధికారుల సమక్షంలో చార్జింగ్ఎస్ఈ సిలియా నాయక్, డీఈ బాన్సువాడ వినోద్, ఏఈ బాన్సువాడ సంతోష్ కుమార్‌తో పాటు టీఆర్ఈ సిబ్బంది, బాన్సువాడ విద్యుత్ సిబ్బంది సమక్షంలో పీటీఆర్ చార్జింగ్ ప్రక్రియను పూర్తి చేశారు. 5 ఎంవీఏ నుంచి 8 ఎంవీఏకు సామర్థ్యం పెంచడంతో అధిక విద్యుత్ లోడ్ సమయంలో ఏర్పడే ఒత్తిడి తగ్గే అవకాశం ఉంది.

**వినియోగదారులకు ప్రయోజనం**

బాన్సువాడ సెక్షన్ పరిధిలో రోజురోజుకు పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యాన్ని పెంచారు. దీంతో బాన్సువాడ పట్టణం, పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా మరింత స్థిరంగా ఉండటంతో పాటు, భవిష్యత్‌లో పెరిగే విద్యుత్ అవసరాలను తీర్చేందుకు ఈ సామర్థ్య పెంపు దోహదపడనుంది.

**విద్యుత్ వ్యవస్థ బలోపేతం**

8 ఎంవీఏ అందుబాటులోకి రావడంతో బాన్సువాడ విద్యుత్ సరఫరా వ్యవస్థ మరింత బలోపేతం కానుంది. ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యాన్ని పెంచి చార్జింగ్ చేయడంపై విద్యుత్ అధికారులు, సిబ్బంది చేపట్టిన చర్యలపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



## అథ్లెటిక్స్ లో విజయం సాధించిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ అభినందనలు

కామారెడ్డి, బతుకమ్మ : జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీల్లో మర్కల్ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినీలు ఉత్తమ ప్రతిభ కనిపించారు. జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలో విజయం సాధించిన విద్యార్థినిలకు ప్రిన్సిపల్ డాక్టర్ శోభారాణి అభినందించారు. కామారెడ్డి జిల్లా సదాశివ నగర్ మండల్ మర్కల్ గ్రామం నందు ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల(మర్కల్ )కామారెడ్డి కి చెందిన విద్యార్థులు కామారెడ్డి డిస్ట్రిక్ట్ అథ్లెటిక్స్ అసోసియేషన్ వారిచే నిర్వహించబడిన అథ్లెటిక్స్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఎం . బి ఏ 1వ సంవత్సరం, యు -18, షాట్‌పుట్ లో రజత పతకం. స్వప్న- బి సి ఓ ఎం సి ఎ 1వ సంవత్సరం, యు -18, జావెలిన్ త్రో లో కాంస్య పతకం. రా. సంజీవని, ఎంపీసీ ఎస్ 2వ సంవత్సరం, యు -20, 100 మీటర్ల పరుగులో స్వర్ణ పతకం. కె . దివ్య, ఎం ఎస్ డి ఎస్ 3వ సంవత్సరం, యు -20, 100 మీటర్ల పరుగులో రజత పతకం సిహెచ్ . శిరీష, బి ఎస్ సి ఆనర్స్ 3వ సంవత్సరం, యు -20, 400 మీటర్ల పరుగులో రజత పతకం సిహెచ్. వైష్ణవి, ఎం ఎస్ డి ఎస్ 3వ సంవత్సరం, యు -20, డిస్కస్ త్రో లో స్వర్ణ పతకం. ఎం . సరిత, బి ఎ 2వ సంవత్సరం, యు -20, లో రజత పతకం.బి . నవ్యశ్రీ, బి ఎ 2వ సంవత్సరం, యు -20, జావెలిన్ త్రో లో స్వర్ణ పతకం. ఎం . గోపిక, ఎం బి జెడ్ సి 2వ సంవత్సరం, యు -20, జావెలిన్ త్రో లో రజత పతకం బి . ప్రహర్ష, బి ఎ 2వ సంవత్సరం, యు -20, లాంగ్ జంప్ లో స్వర్ణ పతకం.టి . అరుణ, బి ఏ 2వ సంవత్సరం, యు -20, షాట్‌పుట్ లో కాంస్య పతకం. మొత్తం స్వర్ణ పతకాలు -4,రజత పతకాలు -4,కాంస్య పతకాలు -3. మొత్తంగా 11




పతకాలు సాధించి సత్తా చాటారు. ముగ్గురు విద్యార్థినిలు . సిహెచ్ .వైష్ణవి,బి .నవ్యశ్రీ, టి . సంజీవని స్టేట్ లెవల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ విధమైన ప్రతిభ కనబర్చిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి. శోభారాణి, వైస్ ప్రిన్సిపల్ ఎస్. కృష్ణవేణి,ఫిజికల్ డైరెక్టర్ రమాదేవి తో పాటు అధ్యాపక బృందం అభినందించారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాల సమస్యలపై షబ్బీర్ అలీ ఇంటి ముట్టడి

కామారెడ్డి, బతుకమ్మ : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నెలకొన్న మౌలిక వసతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) నాయకులు ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ నివాసాన్ని ముట్టడించారు. శుక్రవారం కామారెడ్డి జిల్లా కేంద్రం లో నిరసన చేపట్టారు..ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకుడు చరణ్ మాట్లాడుతూ... కళాశాలలో గత ఐదేళ్లుగా తగినన్ని తరగతి గదులు, మరుగుదొడ్లు, తాగునీరు, బెంచీలు వంటి కనీస వసతులు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. వసతులు లేక విద్యార్థులు చెట్ల కిందే పాఠాలు వినాల్సిన దుస్థితి నెలకొందని తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థులు చదివే ఈ కళాశాల పరిస్థితిని ఏ నాయకుడు గానీ, అధికారి గానీ వచ్చి పరిశీలించకపోవడం విచారకరమన్నారు. సమస్యలను తక్షణమే పరిష్కరించకపోతే ఆమరణ నిరాహార దీక్షకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ ప్రతినిధులు శశి, కౌశిక్, అల్తాఫ్, స్వస్తిక్, అజాబ్, రాజు, భరత్ తదితరులు పాల్గొన్నారు.



బతుకమ్మ
22 ఆగస్టు 2026 శనివారం

# ఎమ్మార్పీఎస్ జిల్లా సదస్సు కరపత్రాల ఆవిష్కరణ

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మేడి పాపన్న ఆదేశాల మేరకు ఆగస్టు 31 వరకు జరిగే జిల్లా సదస్సులకు సంబంధించిన కరపత్రాలను నిజామాబాద్ ఎంఆర్పిఎస్ అధ్యక్షుడు మల్లమరి సుధాకర్ ఆధ్వర్యంలో కరపత్రాల ఆవిష్కరణ జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీలపై చిన్న చూపు చూస్తుందని దళిత జాతి ఆత్మగౌరవం ఆర్థిక అభివృద్ధికి తోడ్పడాలని గత చరిత్ర చూస్తే గతంలో అధికారంలో ఉన్న పార్టీలు గానీ ప్రస్తుత ప్రతిపక్ష పార్టీలు గానీ ముఖ్యంగా బిజెపి, బి ఆర్ ఎస్ లతో పాటుగా గతంలో ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ అనేక సంవత్సరాలుగా దళితులకు ప్రభుత్వం ద్వారా న్యాయంగా రావలసిన దక్కాల్సిన దళిత వర్గాలకు తీవ్రమైన అన్యాయం చేస్తున్నాయని ఆయన అన్నారు. ఇందుకోసం జాతి వర్గాలు తమ హక్కులు మన హక్కులకై 31 తేదీ వరకు నిర్వహించే జిల్లా సదస్సులను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అదేవిధంగా ఎస్సీ సంక్షేమ పథకాలపై ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు అప్పుడే గౌరవం దక్కుతుందని అన్నారు. ఎస్సీలకు సంక్షేమ పథకాలు వచ్చేవరకు ఉద్యమాలు కొనసాగుతూనే ఉంటాయని అన్నారు. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో సంక్షేమ పథకాలు దళితులకు పేరుకు మాత్రమే ఉన్నాయని, కానీ అవి అమలుకు నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దళిత బడుగు బలహీన వర్గాల ప్రజలకు తీవ్ర నష్టం జరుగుతున్నందున వెంటనే సంక్షేమ పథకాలు అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. ఇటీవల నూతనంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షునిగా ఎన్నికైన మల్లమారి సుధాకర్ ను జిల్లా ఎమ్మార్పీఎస్ నాయకులతో పాటు ఎమ్మార్పీఎస్ నగర అధ్యక్షురాలు సమాధాన ఘనంగా పూలమాలలు శాలువాలతో సన్మానించారు.





## పెండింగ్ భూసేకరణను
# వేగవంతంగా పూర్తి చేయాలి

**రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి**

**జిల్లా కలెక్టర్లు, నీటి పారుదల శాఖ అధికారులతో**

**వీడియో కాన్ఫరెన్స్ మంత్రి సమీక్ష**



నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : రాష్ట్రంలో నీటిపారుదల ప్రాజెక్టుల పరిధిలో పెండింగ్‌లో ఉన్న భూసేకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి కలెక్టర్లకు సూచించారు. శుక్రవారం ఉదయం హైదరాబాద్ నుంచి ఆయన అన్ని జిల్లాల కలెక్టర్లు, నీటి పారుదల శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. నీటిపారుదల ప్రాజెక్టుల పనులు సకాలంలో పూర్తయ్యేందుకు పెండింగ్ భూసేకరణను పూర్తి చేయాల్సిన అవసరం ఉందని మంత్రి అన్నారు. పెండింగ్ భూసేకరణ కోసం ప్రభుత్వం రూ.2,800 కోట్లు విడుదల చేసిందని తెలిపారు. కొత్త ఆయకట్టు సృష్టించేందుకు వీలుగా పెండింగ్ భూసేకరణ, పునరావాస పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అన్నారు. భూసేకరణకు అవసరమైన నిధులు అందుబాటులో ఉన్నందున ఎక్కడా జాప్యం లేకుండా ప్రక్రియను పూర్తి చేసి ప్రాజెక్టుల పనులకు ఎలాంటి ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. నిర్వాసితులకు నిబంధనల ప్రకారం పరిహారం చెల్లించాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ భవేష్ మిశ్రా, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.




# రైలులో గంజాం నుంచి గంజాయి రవాణ

**నిజామాబాద్ లో 24 కిలోల గంజాయి స్వాధీనం**

**ఒడిస్సాకు చెందిన ఇద్దరి అరెస్ట్**



నిజామాబాద్ క్రైం, బతుకమ్మ: ఒడిస్సాలోని గంజాం నుంచి రైలులో మహరాష్ట్రకు జరుగుతున్న గంజాయి రవాణాను ఎక్సైజ్ అధికారులు చెదించారు. షిర్డీ ఎక్స్ ప్రెస్ రైలులో గంజాయి రవాణా అవుతుందన్న సమాచారం మేరకు నిజామాబాద్ ఎక్సైజ్ ఎస్ హెచ్ఓ స్వప్న, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ అధ్వర్యంలో శుక్రవారం నిజామాబాద్ రైల్వే స్టేషన్ లో రైలులో తనిఖీలు నిర్వహించారు. ఒడిస్సా లోని గంజాం జిల్లా కలిమెగి, కోడలా ప్రాంతానికి చెందిన గనేష్ సోలి, దిపక్ సాహులకు సంబందించిన రెండు సూట్ కేసులను తనిఖి చేశారు. వారివద్ద ఉన్న సూట్ కేసులో 24.3 కిలోల ఎండు గంజాయి గుర్తించారు. గుర్తు తెలియని వ్యక్తి రూ.10 వేలు ఇచ్చి షిర్డిలోని ఒక ప్రాంతంలో ఆటో లో పెట్టి రావాలి అని తెలుపడంతో గంజాయి రవాణా చేస్తున్నట్లు అబ్కారి అధికారుల విచారణలో తెలిపారు. ఇద్దరిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ హెచ్ఓ స్వప్న తెలిపారు. ఈ తనీఖీలలో ఆర్పిఎఫ్ఎస్ఐ వెంకటేశ్వర్లు, ఎక్సైజ్ ఎస్ఐ మల్లేష్ కానిస్టెబుళ్లు శైలేష్, సలీం, దేవేందర్, ఆర్పిఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

# నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి

**ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యం!**

**జోన్-3 ఇన్‌చార్జ్ డీఐజీ సన్‌ప్రీత్ సింగ్**






కామారెడ్డి, బతుకమ్మ : కామారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయాన్ని జోన్ 3 డిఐజీ సన్ ప్రీత్ సింగ్ సందర్శించారు. డీఐజీ కి కామారెడ్డి జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా...డీఐజి నేరాలు, డిటెక్షన్, దర్యాప్తుపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పాత నేరస్తుల కదలికలపై నిరంతర నిఘా, రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. జజుబం, కమ్యూనిటీ పోలీసింగ్‌ను బలోపేతం చేయాలని, గంజాయి, సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి, పెట్టాలని కోరారు. గుట్కా, మట్కా, అక్రమ గేమింగ్, జూదంపై కఠిన చర్యలు తీసుకోవల్లన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా కామారెడ్డి డీఎస్పీ కార్యాలయాన్ని సందర్శించిన డీఐజీ కార్యాలయ నిర్వహణ, రికార్డులు, కేసు ఫైల్స్‌ను పరిశీలించారు. "ప్రజల భద్రతే పోలీసుల ప్రధాన బాధ్యత. ప్రతి అధికారి, సిబ్బంది నిజాయితీ, ధైర్యం, అంకితభావంతో సమర్థవంతంగా పనిచేసి ప్రజలకు మరింత సురక్షితమైన వాతావరణాన్ని కల్పించాలి" అని డీఐజీ సన్‌ప్రీత్ సింగ్ సూచించారు.

